క్లుప్తంగా

నగదు, పట్టుబట్టలు పంపిణీ



నవాబుపేట: మండలంలోని పోమాల్‌కు చెందిన యాదమ్మ, నర్సింహులు కూతురు జ్యోతి వివాహానికి బీఆర్‌ఎస్‌ నాయకుడు అభిమన్యు రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. అలాగే బీఆర్‌ఎస్‌ మండల మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మి పెళ్లి కూతురుకు, తల్లిదండ్రులకు పట్టుబట్టలు అందించారు.

బోరు ప్రారంభం

గండీడ్‌: మండలంలోని వెన్నాచేడ్‌లో గురువారం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నూతన బోరును సర్పంచ్‌ పుల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆశన్న, మాసయ్య, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్‌: మండలంలోని వాడ్యాల్‌కు చెందిన అనెగళ్ల ఎల్లమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకుడు విజయ్‌కుమార్‌ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ వెంకటేష్‌గౌడ్‌, మల్లయ్య, జంగయ్య, రమేష్‌, అంజయ్య తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలకు ప్రమాణాల సర్టిఫికెట్లు

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జాతీయ ప్రమాణాలు పాటిస్తున్న ఆస్పత్రుల జాబితో చేరాయి. మార్చి 10, 11న జాతీయ ప్రమాణాల కమిటీ ఆస్పత్రులను సందర్శించి ఇక్కడ ఉన్న ప్రమాణాలను పరిశీలించి వెళ్లింది. ఈక్రమంలో అడ్డాకుల, జానంపేట పీహెచ్‌సీలు ప్రమాణాల సర్టిఫికెట్ల జాబితాలో చేరాయి. ఇందుకు గాను ఆయా ఆస్పత్రులకు ఏడాదికి రూ.3లక్షలు మంజూరు కానున్నట్లు అడ్డాకుల సీహెచ్‌ఓ భాస్కర్‌ తెలిపారు. మూడేళ్ల పాటు ఏటా రూ.3లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తాయన్నారు. ఆస్పత్రులు సర్టిఫికెట్లకు ఎంపిక కావడంతో ఆయా ఆస్పత్రుల వైద్యులు, ఇతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని అనాథశరణాలయంలో నిర్వహించారు. పిల్లలమధ్య మధుసూదన్‌రెడ్డి కేక్‌కట్‌ చేసి వారికి తినిపించారు.
నవాబుపేట: కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని మండల కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా సన్మానించారు.
దేవరకద్ర: మండల కేంద్రంలో కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య జరుపుకున్నారు.
చిన్నచింతకుంట: కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

నేడు పురోత్తమ మాత విగ్రహ ప్రతిష్ఠాపన

పాలమూరు: అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప కొండపై మాలికా పురోత్తమ మాత విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్నట్లు అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు సి.ఆర్‌ భగవంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:53గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విరాళాల వెల్లువ

నారాయణపేట రూరల్‌: ప్రైవేట్‌గా ప్రారంభమై ఎయిడెడ్‌గా మారి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా రూపాంతరం చెందిన సీవీఆర్‌ డిగ్రీ కళాశాల తాజాగా న్యాక్‌ గ్రేడ్‌ గుర్తింపు రేసులో ఉంది. దీంతో కళాశాలను నెలరోజులుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించే పనిలో అధ్యాపకులు నిమగ్నమయ్యారు. అయితే దీనికి అవసరమైన నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా వాట్సాప్‌ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో పూర్వ విద్యార్థులను కలుపుతూ వచ్చారు. వారి నుంచి తోచినంత ఆర్థికసాయాన్ని తీసుకుని చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళ్తున్నారు. 1988–91 నుంచి 2009–12 బ్యాచ్‌ వరకు 200మంది డబ్బులను అందించారు. ఇంకా ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశ్యంతో ఈనెల 7న ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని చేపడుతున్నారు. ప్రతి రోజు కళాశాలకు చేరుకుని పలువురు పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్‌ రంగారెడ్డి, న్యాక్‌ కో ఆర్డినేటర్‌ నారాయణగౌడ్‌లను శాలువాతో సన్మానించి, కళాశాల అభివృద్ధికి నగదు అందిచేస్తున్నారు. గురువారం స్థానిక శ్రీసాయి కళాశాల యాజమాన్యం రూ.51వేలను అందచేశారు. అయితే ఆర్థిక సహకారం చేసిన పూర్వ విద్యార్థుల్లో వికారాబాద్‌ కలెక్టర్‌ నారాయణరెడ్డితో పాటు పలువురు వివిధ జిల్లాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

సర్వీస్‌ రోడ్డు లేక ప్రమాదాలు

- పెద్దాయపల్లి చౌరస్తాలో చోటుచేసుకుంటున్న ఘటనలు
- పట్టించుకోని అధికారులు



తాత్కాలిక రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

బాలానగర్‌: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు లేకపోవడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత సంవత్సరంలో ఇద్దరు అక్కా తమ్ముడు, మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గుండేడ్‌ వైపుగా ఉన్న గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే పెద్దాయపల్లి ముఖ్య కూడలి జాతీయ రహదారిని దాటుకుని రావాల్సి ఉంటుంది. దీంతో రోడ్డు దాటే సమయంలో ప్రమాదం బారినపడుతూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. అంతేకాకుండా గుండేడ్‌ రోడ్డువైపున అయ్యప్ప స్వామి, సాయిబాబా ఆలయానికి రాకపోకలు సాగించే భక్తులు సైతం పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. పెద్దాయపల్లి వైపుగా ఓ వైపు నాలుగు వరసల రోడ్డు అందుబాటులో ఉండగా, గుండేడ్‌ వైపు కేవలం రెండు వరుసల రహదారి మాత్రమే ఉంది. దీంతో గుండేడ్‌ వైపుగా భారీ వాహనాలు వచ్చిపోయే సమయంలో డబుల్‌ రోడ్డును పూర్తిగా ఆక్రమించి టర్న్‌ తీసుకుంటున్నాయి. దీంతో అటువైపుగా వచ్చే వాహనదారులు అదుపుతప్పి యూటర్న్‌ తీసుకుంటున్న వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు..

మండల కేంద్రానికి వచ్చే ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాల భారిన పడుతున్న విషయాన్ని గమనించిన సర్పంచ్‌ విజయలక్ష్మి స్పందించి ప్రజల అవసరాల మేరకు తాత్కాలికంగా రోడ్డు వేయించారు. మండల కేంద్రంలోని భవానీమాత ఆలయం నుంచి పాత బ్రిడ్జి వరకు జాతీయ రహదారి పక్కన 10ఫీట్ల మేర ఉన్న గుంతలో మట్టిని పోసి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నిర్మాణం చేపట్టారు. నిధుల లేమి కారణంగా రోడ్డుకు అవసరమైన మరమ్మతు చేయకపోవడంతో రాళ్లు, గుంతలమయంగా ఉంది. గుండేడ్‌, చెన్నంగులగడ్డ తండా, ఎక్వాయపల్లి, చింతకుంట తండా, నేరాళ్లపల్లి, ఊటకుండతండా, వాయిల్‌కుంట తండా, కొత్రతండా, రాఘవాపూర్‌, చౌక్కంపేట్‌, కుత్నేపల్లి, జాలుగడ్డ తండా, జీడిగుట్ట, ఈదమ్మగడ్డ తండా, మే డిగడ్డ తండా, మాచారం, ఉడిత్యాల, సూరారం, వీరన్నపల్లి తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారు. వర్షం వచ్చిందంటే బురదతో నానా అవస్థలు పడుతున్నారు. అధికారు లు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు దాటాలంటే భయం..



మండల కేంద్రానికి కూలీ కోసం రోజూ వెళ్లివస్తాం. పెద్దాయపల్లి రోడ్డు వద్ద రోడ్డు దాటాలంటే ప్రతి రోజూ భయంగా ఉంటుంది. అటు వైపు వాహనాలు వేగంగా వస్తుంటాయి. సర్వీసు రోడ్డు సరిగా లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి. – చెన్నయ్య, వాహనదారుడు

నిత్యం ఇబ్బందులే..



మండల కేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. సమస్య పరిష్కారం దిశగా తాత్కాలికంగా రోడ్డును సొంత ఖర్చులతో ఏర్పాటు చేశా. అధికారులు స్పందించి శాశ్వత రోడ్డును ఏర్పాటు చేయాలి. – విజయలక్ష్మి, సర్పంచ్‌, బాలానగర్‌

సమస్య పరిష్కరిస్తాం..

ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసలుగా నిర్మించేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. డీపీఆర్‌ బిడ్‌ స్టేజిలో ఉంది. ప్రత్యేకంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయడానికి ప్రస్తుతం ఎలాంటి అనుమతులు లేవు. – ఇబ్రహీం, మేనేజర్‌, రాయికల్‌ టోల్‌ప్లాజా

వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

మహమ్మదాబాద్‌: మండలంలోని ధర్మాపూర్‌, బొమ్మికుంట తండాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాలాజీ, నర్సమ్మ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నదని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. దళారులను నమ్మి మోసపోరాదని కోరారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

మహమ్మదాబాద్‌: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని ఆలయ కమిటీ ధర్మకర్త గోపాల్‌ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరవిందం గురుస్వామి వారి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అనంతయ్య గుప్త, వెంకటయ్య, శ్రీరాములు, బాల్‌చందర్‌, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్‌ శివకుమార్‌

మహబూబ్‌నగర్‌ క్రీడలు: వేసవి కరాటే ఉచిత శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జీకే షోటోకాన్‌ సీనియర్‌ కరాటే మాస్టర్‌ శివకుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల మైదానంలో శివకుమార్‌ ఆధ్వర్యంలో వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరం కొనసాగుతుంది. ఈ సందర్భంగా మాస్టర్‌ శివకుమార్‌ విద్యార్థులకు, యువతకు కరాటే శిక్షణ అందజేస్తున్నారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 7:30గంటల వరకు కరాటే శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు 9515654230 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు



అమిస్తాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్‌ కలెక్టర్‌ సీతారామారావు

భూత్పూర్‌: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అడిషనల్‌ కలెక్టర్‌ సీతారామారావు తెలిపారు. మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి పరీక్షలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. అనంతరం కొత్త మొల్గరలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం కొలుగోలు చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్‌ వెంట జిల్లావైద్యాధికారి కృష్ణ, జిల్లా ఉప వైద్యాధికారి భాస్కర్‌ నాయక్‌, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ డా.సంధ్య కిరణ్మయి, జిల్లా కంటి వెలుగు అధికారి డా.వినోద్‌ కుమార్‌, దత్తాత్రేయ, సీహెచ్‌ఓ రామయ్య, వైద్యాధికారులు హిమబిందు తదితరులు ఉన్నారు.

ఈటె బాలకిష్టయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్‌ రూరల్‌: మాదిగ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దివంగత నాయకుడు ఈటె బాలకిష్టయ్య వర్ధంతిని గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, పి.బాలయ్య, బాలరాజు, కొండయ్య, నర్సిములు, ఎస్‌.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీని సరిచేయరా?



రోడ్డుపై పారుతున్న మిషన్‌ భగీరథ తాగునీరు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక తెలంగాణ చౌరస్తాలో మిషన్‌ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఇటీవల ఇదే చౌరస్తాలో పైపులైన్‌కు లీకేజీ అయ్యి రోడ్డుపై తాగునీరు వృథాగా పోవడంతో మున్సిపల్‌ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన వారు ఈనెల 3న బాగు చేశారు. అయితే 24గంటలు గడవకముందే దీనికి కొద్ది దూరంలో మళ్లీ పైపులైన్‌ లీకేజీ అయ్యింది. దీంతో అక్కడి నుంచి అంబేడ్కర్‌చౌరస్తా వరకు తాగునీరు ఏరులై పారింది. ఈ విషయమై ఏఈ పృథ్వీని వివరణ కోరగా, వెంటనే మరమ్మతు చేయిస్తామన్నారు. ఆ ప్రాంతంలో పైపులైన్‌ రోడ్డుకు తక్కువ లోతులో ఉండటం వల్ల వాహనాల ధాటికి తరచూ పగిలిపోతుందని తెలిపారు.

ఆస్పత్రిలో ఏజెన్సీ రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సురేష్‌, కార్మికులు

బాలానగర్‌: ప్రభుత్వ ఆస్పత్రిలో కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న వెంకటయ్య ఏజెన్సీని రద్దు చేయాలని తెలంగాణ మెడికల్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రి కార్మికులతో కలిసి ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ సృజనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌ మాట్లాడుతూ వెంకటయ్య సెక్యూరిటీ ఏజెన్సీ వారు జీతాలలో భారీ కోతలు చూపిస్తూ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సత్తయ్య

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం వీఓఏలకు వేతనాలను పెంచాలని, గతంలో సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రత్యేక యూనిఫామ్స్‌తో పాటు గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేస్తున్నారని, వారి సేవలకు ప్రతిఫలంగా వేతనాలను రూ.26వేల వరకు పెంచాలని కోరారు. రూ.10లక్షల బీమా, అర్హులైన వీఓలను సీసీలుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో వీఓలు తిరుపతమ్మ, రమాదేవి, వసియాబేగం, సరిత, స్వరూప, కల్పన, సుజాత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మి

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని 23వ వార్డు మణినగర్‌లో రూ.6లక్షలతో సీసీరోడ్డు పనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దోరేపల్లి లక్ష్మి గురువారం ప్రారంభించారు. కాల్వ నిర్మాణంలో నాణ్యత ఉండేలా చూసుకోవాలని, ఇబ్బందులు రాకూడదని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్‌ మహమూద్‌షేక్‌, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్‌, రమేష్‌, నందకిశోర్‌గౌడ్‌, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ రేణుక, హఫీజ్‌ పాల్గొన్నారు.

25వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్‌ మహమూద్‌షేక్‌ ప్రారంభించారు. శిబిరంలో వార్డుకౌన్సిలర్‌ లత పాల్గొన్నారు.

కావేరమ్మపేటలో బొడ్రాయి ఉత్సవాల కోసం గురువారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దోరేపల్లి లక్ష్మి పూజలు చేశారు. గ్రామ ముఖ్య కూడలిలో బొడ్రాయి ప్రతిష్ఠ కోసం నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజు, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తత ముఖ్యం



సంజీవయ్య కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జడ్చర్ల: అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. గురువారం స్థానిక నల్లకుంట, సంజీవయ్య కాలనీ తదితర కాలనీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. ఆధార్‌ కార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఇళ్లకు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, 100 డయల్‌ను వినియోగించుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని అవగాహన కల్పించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 50బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, లెనిన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బజరంగ్‌దళ్‌ కార్యకర్తలు

జడ్చర్ల టౌన్‌: కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని చెప్పడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో బజరంగ్‌దళ్‌ కార్యకర్తలు కాంగ్రెస్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. బజరంగ్‌దళ్‌ను పీఎఫ్‌ఐతో పోల్చడాన్ని వారు ఖండించారు.

నిజాయితీ చాటుతున్న భక్తురాలు



రాఘవేందర్‌కు ఉంగరాన్ని అందజేస్తున్న చైర్మన్‌ రమేష్‌గౌడ్‌

అడ్డాకుల: దైవ దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలికి ఆలయంలో బంగారు ఉంగరం దొరకగా, ఆలయ నిర్వాహకులకు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఆలయ నిర్వాహకుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌ పట్టణానికి చెందిన రాఘవేందర్‌ తన కుమారుడి పుట్టిన రోజు ఉండటంతో గురువారం ఉదయం కుటుంబ సమేతంగా కందూర్‌ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. మహబూబ్‌నగర్‌కు వెళ్లాక తన చేతికి ఉన్న ఉంగరం కనిపించకపోవడంతో ఆలయ నిర్వాహకులకు ఫోన్‌ చేసి విషయం తెలిపాడు. ఆలయ సిబ్బంది ఉగరం కోసం వెతికినా దొరకలేదు. కర్నాటక రాష్ట్రంలోని యాద్గీర్‌ జిల్లా కందుకూరుకు చెందిన జ్యోతికి ఆలయంలో ఉంగరం దొరకడంతో ఆమె ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ చైర్మన్‌ రమేష్‌గౌడ్‌ ఉగరం పోగొట్టుకున్న రాఘవేందర్‌కు ఫోన్‌ చేసి విషయం తెలిపారు. రాఘవేందర్‌ ఆనందం వ్యక్తం చేస్తూ ప్రతి సోమవారం ఆలయం వద్ద జరిగే అన్నదానానికి రూ.5,016లు చందాను రాశారని ఆలయ చైర్మన్‌ తెలిపారు.

వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలి



గండేడ్‌లో నిరసన తెలుపుతున్న జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు



భూత్పూర్‌లో..



నవాబుపేటలో..



దేవరకద్రలో మాట్లాడుతున్న టీపీసీసీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి

దేవరకద్ర: జూనియర్‌ పంచాయతీ సెక్రటరీలను వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని టీపీసీసీ రాష్ట్ర నాయకులు, టీ పీఆర్‌టీయూ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. గురువారం దేవరకద్రలో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ సెక్రటరీలకు మద్దతుగా ఆయన పాల్గొని ప్రసంగించారు. జూనియర్‌ పంచాయతీ సెక్రటరీలను రెగ్యులరైజ్‌ చేసి ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బేసిక్‌ పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలని, జీరో వన్‌ జీరో ఆర్థిక శాఖ పద్దు ద్వారా నెలనెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

ముగ్గులు వేసి నిరసన..

భూత్పూర్‌: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని గురువారం జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్‌, గఫార్‌, నయూం, సునీల్‌, రాజేష్‌, సింధు, రజిత, శ్రీకాంత్‌, రంజిత్‌ ఉన్నారు.

నవాబుపేట: గ్రామాల్లో పనిచేసిన జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్‌ చేసి వారికి సరిపడా వేతనం అందించాలని ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్‌ డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల సంఘం నాయకులు రవికిరణ్‌, భీమయ్య, సంతోష్‌, శ్రీశైలం, ఆనంద్‌ పాల్గొన్నారు.

గండేడ్‌: మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శుల సమ్మె 7వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఆంజనేయులు, చెన్నకేశవులు, రాధిక, ప్రవల్లిక, శిరీష, రాఘవేందర్‌, సంజీవరెడ్డి, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌: మండలంలోని జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు పల్లె ప్రకృతివనం ముగ్గు వేసి నిరసన తెలిపారు.

జడ్చర్ల: తమను రెగ్యులరైజ్‌ చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామనిమండల జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌ తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష గురువారం 7వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కార్యదర్శి అభిలాష్‌, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాశ్‌, స్వాతి, సత్యమ్మ, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.